క్లుప్తంగా

చికిత్సకు చేయూత ఇవ్వండి

ములకలపల్లి: మండలంలోని మూకమామిడి పంచాయతీ మొగరాలగుప్ప గ్రామానికి చెందిన కోంద్రుప్రసాద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గాలిబ్లీడర్ ఇన్‌ఫెక్షన్ కు గురైన ప్రసాద్‌కు గతంలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ ఖర్చు సుమారు రూ 1.5 లక్షల వరకు అయింది. కొన్నాళ్లు బాగానే ఉన్నా.. ఇటీవల మళ్లీ ఇన్‌ఫెక్షన్ మొదలైంది. నిమ్స్‌కు వెళ్లగా మరలా ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే ప్రసాద్ ఆస్పత్రి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. స్థానికంగా వైద్యం చేయించుకుంటున్నాడు. దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ చొరవ చూపాలని అభ్యర్థిస్తున్నాడు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

ములకలపల్లి: పెరుగుతున్న సైబర్, ఆన్‌లైన్ మోసాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతో వ్యవహరించాలని స్థానిక ఎస్సై రాజమౌళి సూచించారు. మంగళవారం ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలో ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసపోతున్న బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారని, ఈ బాధితుల సంఖ్యలో మండలంలోనే అధికంగా నమోదు అవుతున్నారని తెలిపారు. ఇప్పటి దాకా మండలంలో ఏడుగురు బాధితులు యాప్‌ల ద్వారా మోసపోయి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు ఆయన చెప్పారు. ఈ కేసులపై విచారణ జరుగుతుందని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. బాధితులు, నష్టపోయిన వారు తక్షణమే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ములకలపల్లి: ఆధార్‌కార్డు ద్వారా నగదు తీసుకునేందుకు వచ్చిన తమపై దురుసుగా ప్రవర్తించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ బాధిత మహిళా పాయం లలిత మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. సోమవారం ములకలపల్లిలోని ఓ షాప్ వద్ద ఆధార్ కార్డుతో నగదు డ్రా తీసి ఇవ్వడానికి షాపు యజమాని రూ.20 చెల్లించాలని చెప్పాడు. అది కట్టడం ఇష్టం లేక విత్‌డ్రా వద్దని లలిత వెనుదిరిగింది. అయినప్పటికీ నగదు చెల్లించాలంటూ షాపు యజమాని లలితను దుర్భాషలాడి, దౌర్జన్యంకు దిగాడు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు చేసింది.

ప్రైవేట్ ఆపరేటర్లపై భారం సరికాదు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో హెచ్ఈఎంఎం లాంటి భారీ వాహనాలు నడపడానికి ప్రైవేట్ కాంట్రాక్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లు నియమించి భారం మోపడం సరికాదని హెచ్ఎంఎస్ యూనియన్ మణుగూరు బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ కొడిపెల్లి శ్రీలత మంగళవారం పేర్కొన్నారు. ఇంటర్నల్ కార్మికులతో భర్తీ చేయాలే తప్ప పర్మనెంట్ పని స్థలాల్లో ప్రైవేట్ వారిని నియమించాలనే పాలసీని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో వివిధ రూపాల్లో డ్రైవర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తూ పోరాడతామన్నారు.

పనిముట్లు పంపిణీ చేయాలి

చంద్రుగొండ: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు పనిముట్లు పలుగు, పార ఉచితంగా పంపిణీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రావికంపాడు, దుబ్బతండ గ్రామాల్లో మంగళవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. పనిప్రదేశాల్లో నీడ టెంట్లు, ఓఆర్ఎస్, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్డీ మండల నాయకులు వరికూటి వెంకట్రావ్, భీముడు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ములకలపల్లి: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రామాంజనేయపురం గ్రామానికి చెందిన దేవళ్ళ వెంకటేష్ కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకరరావు పరామర్శించారు. ప్రమాద ఘటనను ఎమ్మెల్యే జారేఆదినారాయణ దృష్టికి తీసుకువెళ్లి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ తారాచంద్, కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాంబాబు, పిడియాల బుజ్జి, సురభి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గుట్టమల్లారంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో నేడు జరిగే నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు మంగళవారం విజ్ఞప్తి చేశారు. సమావేశానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావులు అతిథులుగా హాజరౌతారని తెలిపారు.

నిలిచిన రహదారుల పనులు

- ఏడాది క్రితమే శంకుస్థాపన
- గత ఎన్నికల కోడ్‌తో పనులకు బ్రేక్
- బిల్లు అందకపోవడంతో పునఃప్రారంభించని కాంట్రాక్టర్లు


రామచంద్రాపురం-ఇరవెండి రహదారి..

అశ్వాపురం: మండలంలో ఏడాది క్రితం రూ.15.07 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్ల నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే మట్టి పనులు పూర్తయి వైట్ మిక్సర్ వేసి బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా.. రహదారుల పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ఎన్నో ఏళ్ల రహదారులకు మోక్షం కలుగుతుందని, తమ కష్టాలు తీరుతాయని ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగింది.

గత ఏడాది ఫిబ్రవరి 21న గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రూ.2 కోట్లతో రామచంద్రాపురం-ఇరవెండి రహదారి, రూ.1.40 కోట్లతో గొల్లగూడెం-సర్వాయిపాడుబంజర రహదారి, రూ.2కోట్లతో తురుములగూడెం-రైల్వేస్టేషన్ రహదారి, రూ.కోటితో సంద్రలబోడు-వెంకటేశ్వర స్వామి ఆలయం రహదారి, రూ.2 కోట్లతో గొంది గూడెం-ఎలకలగూడెం రహదారి, రూ.6.67 కోట్లతో ఎలకలగూడెం-మనుబోతులగూడెం రహదారులకు.. మొత్తం రూ.15.07 కోట్లతో శంకుస్థాపన చేశారు.

ఆ తర్వాత ఆలస్యంగా రహదారుల పనులు ప్రారంభించడం, పనులపై అధికారులు దృష్టి సారించకపోవడం.. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో కాంట్రాక్టర్లు రహదారుల పనులు నిలిపివేశారు. ఎన్నికలు ముగిసిన అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా రహదారుల పనులు పునఃప్రారంభం కాలేదు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ రహదారుల పనులు నిలిపివేసినట్టు సమాచారం. ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారుల పనులు ప్రారంభించి వర్షాకాలం లోపు రహదారుల పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలో కోట్ల రూపాయలతో బీటీ రోడ్ల పనులు గత ఏడాది ప్రారంభించాం. మట్టి పనులు, వైట్ మిక్సర్ వేశారు. బీటీ పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే బీటీ రోడ్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎంకే.ప్రసాద్, ఐటీడీఏ ఏఈ

రూ.36 లక్షలతో ఊరచెరువు అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్‌రెడ్డి

బూర్గంపాడు: రూ.36లక్షల నిధులతో నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని ఊరచెరువును సుందరంగా అభివృద్ధి చేపట్టనున్నట్లు రోటరీ ఇంటరర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రెడ్డిపాలెం ఊరచెరువును పరిశీలించి అక్కడేవున్న ముత్యాలమ్మ గుడి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరచెరువు కట్టను పటిష్టపరిచి చెరువు చుట్టు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు కట్టకు ఇరువైపులా మొక్కలు నాటడం, లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. చెరువు పూడిక తీయటంతో భూగర్భ జలాలు పెరుగుతాయని, పశువుల దాహార్తి తీరుతుందన్నారు. అదేవిధంగా చేపల పెంపకానికీ అనువుగా ఉంటుందన్నారు. ఖమ్మం లకారం చెరువు మాదిరిగా అందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే విధంగా చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మే నెల మొదటివారంలో పనులు ప్రారంభించి నెలరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని వెల్లడించారు. అదేవిధంగా రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి అభ్యర్థన మేరకు కస్తూర్బా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వం భవనాలను సమకూర్చాలన్నారు. సమావేశంలో బూసిరెడ్డి అన్నపూర్ణ, సూరెడ్డి చందారెడ్డి, గాదె పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపై సంతాపం

మణుగూరురూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది బచ్చలకూరి రామచంద్ర మృతికి సంతాపంగా.. మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను సెలవు ప్రకటించారు. తొలుత సీనియర్ న్యాయవాది బచ్చలకూరి రామచంద్ర మృతికి సంతాపం వ్యక్తంచేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన మృతికి సంతాప సూచికంగా వారు విధులకు దూరంగా ఉంటూ శ్రద్ధంజలి ఘటించారు. ఈ సందర్భంగా వార్లు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో ఉంటూ ఎంతోమంది జూనియర్ న్యాయవాదులకు మెళకువలు నేర్పుతూ... అందరితో సత్సంబంధాలు కొనసాగించేవారని, ఆయన మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు దాసరి కవిత, మేదరమెట్ల శ్రీనివాస్, కందిమళ్ల నర్సింహరావు, పానుగోటి కిషన్‌రావు, సర్వేశ్వరరావు, రామ్మోహన్‌రావు, కూర్మా విజయ్‌రావు, జాడి చొక్కారావు, పోశం భాస్కర్, నగేష్‌కుమార్, సావిత్రి, పద్మావతి, వాసవి, సంధ్య, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


వాల్‌రైటింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అన్నపురెడ్డిపల్లి, పెంట్లం, మర్రిగూడెం, రాజాపురం, గుంపెన గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వాల్ రైటింగ్స్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పనితీరుపై సమీక్ష

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సీడీపీఓ నిర్మలాజ్యోతి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గ్రామాల్లో బాల్యవివాహాలపై దృష్టి సారించాలని సూపర్‌వైజర్లకు సూచించారు. వేసవిలో చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు రాణి, శకుంతల పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఆదిపరాశక్తి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండలానికి చెందిన 500 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీపీ ముత్తినేని సుజాత వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, కాంగ్రెస్ నాయకులు యక్కటి పున్నారెడ్డి, వలబోజు మురళీకృష్ణ, చంద్రకళ, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ ఎంపీయూపీఎస్ పాఠశాలలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె.మీరాహుస్సేన్ విద్యార్థులకు పుస్తక పఠన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, రవిబాబు, రఘుమోహన్‌రావు, జయలక్ష్మి, వీరు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరలో జెడ్పీటీసీ

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దార్లగూడెం గ్రామంలో జరుగుతున్న తులసమ్మ జాతరలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు. గత రెండు రోజులుగా జాతర జరుగుతోంది. జెడ్పీటీసీ వెంట గిరిజన సంఘం నాయకులు సరియం కొటేశ్వరావు, గ్రామస్తులు ఉన్నారు.

తిరుపతమ్మ కల్యాణం


ఆలయంలో భక్తుల కోలాహలం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి ఆలయంలో మంగళవారం శ్రీగోపయ్య, తిరుపతమ్మ వార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకల ముగింపును పురస్కరించుకొని ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మ వారి కల్యాణ వేడుకలను జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకొని, కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. తొలిత ఆలయంలో భక్తులు అగ్నిగుండంలో నిప్పులపై నడిచారు. అమ్మ వారిని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లూ చేశారు.

పర్ణశాలలో చక్రస్నానం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజున మంగళవారం ఆలయం వద్ద ఉత్సవ మూర్తులకు తిరుమంజనం చేసి పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం యాగశాల నందు సుదర్శన హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవాల అధికారి అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, రామభద్రాచార్యులు, సీతారామానుజా చార్యులు, వెంకటా చార్యులు, భారద్వాజాచార్యులు పాల్గొన్నారు.

చండీ హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో చండీ హోమం జరిపించారు. మంగళవారం పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం , ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ హోమశాలలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చండీ హోమం జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధిస్తూ దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కాచారానికి చెందిన నవ్యకు అదే గ్రామానికి చెందిన కాకాని నాగేంద్రరావుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు జన్మించాక జీవనోపాధి కోసం అశ్వారావుపేట మండలం భీమునిగూడేనికి వచ్చారు. కొంతకాలంగా నాగేంద్రరావు తన భార్యను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇందులో భాగంగా తాజాగా ఆమెపై దాడి చేయడంతో గాయపడింది. దీంతో బాధితురాలు చేసిన ఫిర్యాదుతో ఆమె భర్తపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఇంటిబాట

అశ్వాపురం: పాఠశాలలకు మంగళవారమే ఈ విద్యా సంవత్సరం చివరి రోజు. నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. కాగా చివరిరోజైన మంగళవారం విద్యార్థులు పాఠశాలల నుంచి ఉత్సాహంగా, ఆనందంగా ఉరుకులు, పరుగులు పెట్టి ఇళ్లకు చేరుకున్నారు.

ప్రగతి రిపోర్ట్ అందజేత..

దుమ్ముగూడెం: విద్యా సంవత్సరం చివరి రోజున మంగళవారం నర్సాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల, సమావేశాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొల్లా వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తూ, ప్రగతి పత్రాలను అందజేశారు. విద్యార్థులకు సెలవులు ప్రకటించారు.


అశ్వాపురం జెడ్పీ స్కూల్ నుంచి ఉత్సాహంగా పరుగులు పెడుతున్న విద్యార్థులు

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఏకకాలం పాటు గుర్తింపు సంఘంగా పనిచేసి ఇటీవల సింగరేణి ఎన్నికల్లో ఓటమిపాలైన టీబీజీకేఎస్ యూనియన్‌కు, బీఆర్ఎస్ సభ్యత్వాలకు మణుగూరు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వీ.ప్రభాకర్‌రావు, బ్రాంచ్ కమిటీ, ఫిట్ కమిటీ సభ్యులు మూకుమ్మడిగా మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో పార్టీ నుంచి సహకారం లేకపోవడంతోనే ఓటమి పాలయ్యామన్నారు. ఇప్పుడు కొంతమంది పార్టీలకతీతంగా యూనియన్ నడిపిద్దాం అని సలహాలివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. తాము పార్టీ, యూనియన్‌లలో కొనసాగలేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్‌పై పెద్దలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తామన్నారు. రాజీనామా చేసిన వారిలో అబ్దుల్ రవూఇఫ్, వీరభద్రయ్య, వి.రెడ్డి, వర్మ, కాపా శివాజీ, అశోక్, బుద్దా వెంకటేశ్వర్లు, రామారావు, గంగాధర్, హబీబ్ హమీన్, ఇంతియాజ్ పాషా, సునీతారెడ్డి, రమేశ్, మహబుబాషా, శ్రీను, హనుమంతరావు, రవికుమార్, నర్సింహా, విద్యాసాగర్, రాజేశ్, ఆదిశంకర్, బాలాజీ, వెంకటేశ్వర్లు, ముత్యంతో పాటు అన్ని కమిటీల సభ్యులు ఉన్నారు. మణుగూరు ఏరియాలో గట్టి పట్టున్న టీబీజీకేఎస్ కీలక నాయకులు మంగళవారం రాజీనామా చేయడంతో బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి షాక్ ఇచ్చినట్లు అయింది.

బాలసాహిత్యం ఆవిష్కరణ


నాగుపల్లిలో పుస్తకాల ఆవిష్కరణ చేస్తున్న సీఈఓ, ఎంఈఓ, హెచ్ఎం, విద్యార్థులు

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన నాలుగు బాల సాహిత్య పుస్తకాలను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాల సాహిత్య పుస్తకాలు రాయగా.. అవి తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు అయ్యాయి. మంగళవారం అదే పాఠశాలలో తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, సీఈఓ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి చేతుల మీదుగా ఆ పుస్తకాలను ఘనంగా ఆవిష్కరించి, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీఈఓ, ఎంఈఓ తదితరులు అభినందిస్తూ.. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు రాయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సరళ, తెలుగు ఉపాధ్యాయురాలు సునంద, సాహితివేత్తలు నామా పురుషోత్తం, ఉపేందర్, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

విశేష వైభవ శోభాయాత్ర

చర్లరూరల్: చర్ల మండల సనాతన దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో విశేష వైభవ శోభాయాత్ర భక్తి శ్రద్ధలతో తేగడ గ్రామం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించారు. తేగడ గ్రామంలోని వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి, భద్రకాళీ వీరభద్ర స్వామి, కుదునూరు వేణు గోపాల స్వామి, ఆర్ కొత్తగూడెం శ్రీ సీతారామచంద్రస్వామి, గొమ్ముగూడెం శ్రీసీతారామ స్వామి, కలివేరు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో పాతచర్లలోని శివాలయం వరకు అన్ని దేవాలయాల ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించగా.. భక్తులు భారీగా పాల్గొన్నారు.

యాత్రంలో శాస్త్రీయ కళాకారుల సన్నాయి మేళతాళాల నడుమ, అందంగా అలంకరించిన సుమారు ఇరవై ట్రాక్టర్లలో ఉత్సవ మూర్తుల శోభాయాత్ర వైభవంగా సాగింది.

హనుమాన్ విజయయాత్ర..

ములకలపల్లి: ములకలపల్లి మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయ యాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అర్చకులు సురేష్‌శర్మ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి మాదారంలోని హనుమాన్ గుడి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు పువ్వుల శ్రీనివాసరావు, కార్యదర్శి కేసరి భద్రం, బజరంగ్‌దళ్ సంయోజక్ అత్యంసాయి, భక్తాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ శనగపాటి రవి, అనుమల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చర్లరూరల్: తేగడ గ్రామం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో భక్తులు

దమ్మపేటలో ఎంపీ అభ్యర్థుల ప్రచారం

- కార్యకర్తలతో సమావేశమైన బీఆర్ఎస్ అభ్యర్థి నామా
- ముమ్మరంగా ప్రచారం చేసిన బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు
- తమనే గెలిపించాలని వేడుకోలు..

అవగాహన ఉన్న వారినే గెలిపించండి

దమ్మపేట: ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న వారినే గెలిపించాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే జిల్లాపై ఉన్న అవగాహనతో సమగ్ర అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. మంగళవారం దమ్మపేట శివారులోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమన్వయ లోపం, నిర్లిప్తత, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాల కారణంగా ఓటమిని చవిచూశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పి, నేటికి అమలు చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. భద్రాచలం నుంచి కొవ్వూరు వరకు రైల్వే లైన్ విస్తరణకు తాను ఎంపీగా ఉన్న సమయంలో 120 సార్లు రైల్వే మంత్రికి లేఖలు రాశానని అన్నారు. పామాయిల్‌కు కనీస మద్దతు ధర రూ.20,000లు ప్రకటించాలని కోరుతూ.. కేంద్ర మంత్రికి పలుమార్లు రాతపూర్వక విజ్ఞప్తి చేశానని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు జాతీయ రహదారులు తీసుకొచ్చిన ఘనత తనదేనని అన్నారు. పది మందితో బూత్ స్థాయి కమిటీలు, మండల సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా ఓటర్లు కారు గుర్తుకే ఓటేసేలా ప్రభావితం చేయాలని సూచించారు. బుధవారం బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నానని, ఈ కార్యక్రమానికి మండల సమన్వయ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అంతకుముందుగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్, కూసంపూడి మహేష్, వగ్గెల పూజ, సున్నం నాగమణి, తూతా నాగమణి, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేష్, జల్లిపల్లి శ్రీరామమూర్తి, ప్రకాష్, దారా యుగంధర్, దారా మల్లిఖార్జున రావు, రావుల శ్రీను, జలగం వాసు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు, పక్కన మెచ్చా, తాటి

ప్రజల కోసం పనిచేస్తా..

కమలం గుర్తుకు ఓటేసి, బీజేపీ తరఫున ఖమ్మం ఎంపీగా తనను గెలిపిస్తే నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల కోసం పనిచేస్తానని ఖమ్మం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు అన్నారు. మండలంలోని మందలపల్లి, దమ్మపేట గ్రామాల్లో బీజేపీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తనను గెలిపించాలని కోరుతూ.. పార్టీ శ్రేణులు ప్రచార రథంపై రోడ్‌షో, కాలినడకన ప్రచారం నిర్వహించారు. మందలపల్లి గ్రామంలో బైక్‌లు, ఆటోలతో ర్యాలీ.. రోడ్‌షో నిర్వహించగా.. అభ్యర్థి వినోద్ రావు పాల్గొన్నారు. మందలపల్లిలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఆయన స్థానిక నాయకుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత దేశ అపూర్వ భవిష్యత్తు కోసం రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించి, మోదీని మరోసారి ప్రధాన మంత్రిగా చేయాలని కోరారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలో స్థానికుడైన తనకు.. జిల్లాలోని సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రచారంలో పలు దుకాణాల వద్దకు వెళ్లి, కమలం గుర్తుకు ఓటేసి తనను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రద్దీగా ఉన్న సంతమార్కెట్ అంతా కలియ తిరిగి ప్రచారం చేశారు. దమ్మపేట ప్రధాన సెంటరులో డీసీఎం వాహనంపై సాంస్కృతిక కళాకారుల ద్వారా కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, నంబూరి రామలింగేశ్వరరావు, గాదె రాంబాబు రెడ్డి, ఎమ్మార్పీస్ నాయకులు కోలిక పోగు కాంతారావు, బీజేపీ నాయకులు పసుమర్తి పుల్లారావు, కోలికపోగు ముసలయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.


కాలినడకన ప్రచారం చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు